సాక్షి
కాకినాడ
గురువారం | 9 | మే | 2024



చెప్పాడంటే.. చేస్తాడంతే!

సాయం చేసిన వారిని గుండెల్లో పెట్టుకుంటారు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వాసులు. ఇచ్చిన హామీలకు కట్టుబడి ఐదేళ్లలో చక్కని పాలన అందించిన సీఎం జగన్‌ను జనం మెచ్చుకుంటున్నారు.

10లో



డెల్టాకు 3,100 క్యూసెక్కులు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 3,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.50 అడుగుల వద్ద నీటి మట్టం కొనసాగుతోంది.

గరిష్టం/కనిష్టం 36.0°/26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	31.0	24.0
కాకినాడ	36.5	24.4
అమలాపురం	36.0	26.0

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీకి ఎన్నారైల మద్దతు

వరుపులకు సంఘీభావంగా ప్రచారం



వరుపులకు మద్దతు తెలుపుతున్న ఎన్నారైలు

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా నియోజకవర్గంలో బుధవారం ఎన్నారైలు ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా నెదర్లాండ్‌కు చెందిన కార్తీక్, వంగా సారథిరెడ్డి, స్విట్జర్లాండ్‌కు చెందిన బ్రహ్మానందరెడ్డి, యూఎస్‌ఏ నుంచి కృష్ణారెడ్డి, ఐటీ వింగ్స్ నుంచి సురేంద్ర, యస్వంత్ లింగంపర్తి గ్రామంలో రచ్చబండ నిర్వహించి సీఎం జగన్ పాలనలో చేసిన అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. వారు మాట్లాడుతూ భూహక్కు చట్టంపై టీడీపీ అసత్య ప్రచారం చేయడం తగదన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నుంచి 70 మెడికల్ కళాశాలలు, 135 పరిశ్రమలు, నాలుగు పోర్టులు, రూ.13 లక్షల కోట్ల విలువచేసే పరిశ్రమల స్థాపనకు ఒప్పందం కుదరగా ఇప్పటివరకు రూ.2 లక్షల కోట్లు రాష్ట్రానికి వచ్చాయన్నారు. 19 లక్షల మందికి ఉపాధి కల్పించారన్నారు. నాడు–నేడులో భాగంగా 44 వేల పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావును కలుసుకుని సంఘీభావం తెలిపారు.

పాలిసెట్ ఫలితాలు విడుదల

బాలాజీచెరువు: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్–2024 పరీక్ష ఫలితాలు బుధవారం అమరావతిలో విడుదల చేశారు. గత నెల 27వ తేదీన జిల్లావ్యాప్తంగా కాకినాడ కేంద్రంగా 27 కేంద్రాలలో పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 8,845 మంది విద్యార్థులు హాజరుకాగా 7,590 ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 5,144 అభ్యర్థులకు 4,304 మంది, బాలికలు 3,702కు 3,286 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 85.81గా నమోదు కాగా బాలికలు 88.76 శాతం, బాలురు 83.69 శాతం సాధించారు.

ఉపాధి అడుగులు.. పారిశ్రామిక పరుగులు

- 15 ఏళ్ల తరువాత తీరంలో పారిశ్రామికీకరణ
- కేఎస్ఈజెడ్‌లో వేలాది మందికి ఉపాధి
- అభివృద్ధి బాటలో తీర ప్రాంత గ్రామాలు
- పరిశ్రమల ప్రగతికి వీలుగా సూపర్ కనెక్టివిటీ
- రోడ్డు, రైలు, నౌకాయాన మార్గాల నిర్మాణం
- బారులు తీరుతున్న పారిశ్రామిక వేత్తలు



నేడు- ఇలా పరిశ్రమలతో కళకళలాడుతున్న కేఎస్ఈజెడ్



నాడు- ఇలా ఖాళీగా ఉండిపోయిన కేఎస్ఈజెడ్ భూములు

పిఠాపురం: ఉపాధి అవకాశాలు మెరుగు పడితేనే ఏ ప్రాంతమైనా అభివృద్ధి సాధిస్తుందని గట్టిగా నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న పారదర్శక, వేగవంతమైన పారిశ్రామిక విధానాల కారణంగా కాకినాడ జిల్లా తీర ప్రాంతంలో పరిశ్రమలు పరుగులు పెడుతున్నాయి. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి. ప్రభుత్వం తీసుకున్న పారిశ్రామిక విధానాలతో కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి (కేఎస్ఈజెడ్) పెట్టుబడులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. 6,440 ఎకరాల్లో విస్తరించి ఉన్న కేఎస్ఈజెడ్‌కు రోడ్డు, రైలు, నౌకాయాన మార్గాల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. ఇప్పటికే పలు రొయ్యల శుద్ధి కర్మాగారాలు నెలకొల్పడంతో వేలాది మంది యువతకు, మహిళలకు ఉపాధి కలిగింది.

నాడు బొమ్మలాట

నాటి టీడీపీ హయాంలో సుమారు 12 ఏళ్ల పాటు రైతుల నుంచి సేకరించిన భూములను ఖాళీగా వదిలేశారు. ఊళ్లకు ఊళ్లను ఖాళీ చేయించి పునరావాస కాలనీకి తరలించి చేతులు దులుపుకున్నారు. ఆర్భాటంగా చైనాకు చెందిన ఒక కంపెనీతో బొమ్మల ఫ్యాక్టరీ ఒకటి పెట్టి పారిశ్రామికీకరణ అంటూ బాకాలు ఊదారు. తీరా చూస్తే అది కొంత కాలంలోనే మూత పడింది. అది తప్ప ఎస్ఈజెడ్‌లో ఏ ఒక్క పరిశ్రమ రాకుండా పోయింది. అటు భూములు కోల్పోయిన రైతులను నట్టేటముంచి ఇటు ఎటువంటి పరిశ్రమలు రాకుండా యువతకు ఉపాధి లేకుండా చేసిన ఘనత ఒక్క టీడీపీకే చెందుతుంది.

నేడు పారిశ్రామిక బాట

2019 ఎన్నికలకు ముందు ప్రజా సంకల్పయాత్రలో జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానికుల విన్నపం మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే సెజ్‌లో పారిశ్రామికీకరణ వేగవంతం చేస్తానని, ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఒక పక్క సెజ్ రైతుల సమస్యను తీర్చడంతో పాటు మరో పక్క అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి పరిశ్రమల స్థాపనకు విశేష కృషి చేశారు. దాని ఫలితంగా కేవలం నాలుగేళ్లలోనే సెజ్ ప్రాంతం పరిశ్రమలతో కళకళలాడుతోంది. ఇప్పటికే ఇక్కడ 10 వరకు రొయ్య శుద్ధి కర్మాగారాలు నెలకొల్పడంతో సుమారు 10 వేల మంది మహిళలకు ఉపాధి కలిగింది. రోడ్డు, రైలు, పోర్టు సౌకర్యాలు ఉండడంతో పారిశ్రామిక వేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. పక్కనే తీర ప్రాంతం ఉండడంతో విదేశీ ఎగుమతులకు అనువుగా ఉంది. దీనికితోడు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఇక్కడ పరిశ్రమలు పరుగులు పెడుతున్నాయి.



కళకళలాడుతున్న కేఎస్ఈజెడ్



కేఎస్ఈజెడ్ రొయ్యల శుద్ధి పరిశ్రమలో పని చేస్తున్న మహిళలు

- 6,440 ఎకరాల్లో అరబిందో కాకినాడ స్పెషల్ ఎకనామిక్ జోన్
- పారదర్శక విధానాలతో పెరిగిన పెట్టుబడులు
- రెండు వేల ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్కు
- రూ.2,500 కోట్ల వ్యయంతో శరవేగంగా గ్రీన్ ఫీల్డు పోర్టు నిర్మాణం
- 410 ఎకరాల విస్తీర్ణంలో రూ.4 వేల కోట్లతో పెన్సిలిన్, క్యూలే ఔషధాల తయారీ పరిశ్రమలు
- కాకినాడ నుంచి అన్నవరం వరకు రూ.1,480 కోట్ల వ్యయంతో భారత్‌మాల రోడ్డు మార్గం
- రూ.260 కోట్లతో అన్నవరం నుంచి కాకినాడకు 15 కిలోమీటర్ల ప్రత్యేక రైల్వే లైన్
- ఉప్పునీటి నుంచి మంచినీటిని తయారు చేసే డిశాలినేషన్ వాటర్ ప్లాంట్ నిర్మాణం
- రూ.359 కోట్లతో 64 ఎకరాల్లో 400 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం
- పలు రొయ్య శుద్ధి కర్మాగారాలు
- ప్రస్తుతం ఉపాధి పొందుతున్న కుటుంబాలు 10 వేలు

వలస అనే ఊసు లేకుండా చేశారు



నా పేరు బండి రాణి. మాది కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు శీలంవారిపాలెం. నేను పొన్నాడ సర్పంచ్‌గా పని చేస్తున్నాను. మా పంచాయతీలో 19 శివారు గ్రామాలు ఉన్నాయి. వాటిలో కొన్ని సెజ్ భూసేకరణలో ఖాళీ చేసేశారు. మా గ్రామాల్లో వ్యవసాయ పనులు తప్ప వేరే ఉపాధిఉండేది కాదు. తీర ప్రాంతం కావడం వల్ల వ్యవసాయ పనులు కేవలం సీజన్‌లోనే ఉండేవి. దీంతో కేవలం మగవారు తప్ప ఆడవారికి ఉపాధి అనేది ఉండేది కాదు. ఉన్న భూములు సెజ్‌కు ఇవ్వడం వల్ల ఎస్ఈజెడ్ వచ్చినా ఒక్క పరిశ్రమ రాక నిరాశతో ఉండేవాళ్లం. ఉపాధి కోసం వలసలు వెళ్లాల్సి వచ్చేది. కాని సీఎం వైఎస్ జగన్ వచ్చాక సెజ్‌లో పరిశ్రమలు వచ్చేశాయి. మా గ్రామాల్లో మహిళలతో పాటు ఇతర ప్రాంతాల మహిళలకు ఉపాధి కలిగింది. ఇంటి పక్కనే పరిశ్రమలు రావడంతో మా గ్రామాల్లో మహిళలు ఇంటి, వంట పనితో పాటు ఉపాధి పొంది చేతి నిండా సంపాదించుకోవడం వల్ల వలసలు వెళ్లే పని లేకుండా పోయింది. గత టీడీపీ హయాంలో ఏవిధమైన ఆసరా లేక అల్లాడిన మా ప్రాంతం ప్రజలు ఇప్పుడు సుభిక్షంగా ఉంటున్నారు అంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పారిశ్రామికీకరణ వల్లే అని బల్లగుద్ది చెబుతాం.

– బండి రాణి, సర్పంచ్ పొన్నాడ, కొత్తపల్లి మండలం

ఉపాధి నిచ్చే పరిశ్రమలే పెడుతున్నారు



నా పేరు కంబాల మౌనిక. మాది కొత్తపల్లి మండలం మూలపేట. నేను మూలపేట గ్రామ సర్పంచ్‌గా పని చేస్తున్నాను. మా గ్రామస్తులు వ్యవసాయంతో పాటు చేపల వేట మీద ఆధారపడి బతుకుతారు. సెజ్ భూసేకరణ తరువాత మా గ్రామాల్లో ఉపాధి లేకుండా పోయింది. టీడీపీ హయాంలో భూములు తీసుకున్నారు తప్ప ఏ ఒక్క పరిశ్రమ స్థాపించలేక పోయారు. ఏళ్ల తరబడి భూములు ఖాళీగా వదిలేశారు. దీంతో మత్స్యకార కుటుంబాలు వలసలకు పోవాల్సి వచ్చేది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇక్కడ పరిశ్రమల స్థాపన ప్రారంభమైంది. ఇప్పటి వరకు ఏ పరిశ్రమ పెట్టినా వేలాది మందికి ఉపాధి కలిగేలా చూస్తున్నారు. మా గ్రామాల్లో ప్రజలకు చేతి నిండా పని దొరికింది. ఏ మత్స్యకార కుటుంబం వలస వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఇంత మార్పు వస్తుందని అనుకోలేదు. ఇది కేవలం జగన్ వల్లే సాధ్యమైందని ఘంటాపథంగా చెబుతాం.

– కంబాల మౌనిక, సర్పంచ్, మూలపేట, కొత్తపల్లి మండలం

ప్రత్యేకతల నెలవు పిఠాపురం

- చేనేత, మత్స్య సంపదకు ప్రసిద్ధి
- ఆధ్యాత్మికంగా పేరు
- వాణిజ్యపంటలకు నెలవు
- జంధానీ చీరలకు జన్మస్థలం

ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు	2,30,048
పురుషులు	1,15,223
స్త్రీలు	1,14,819
ఇతరులు	4



పిఠాపురం: భౌగోళికంగా సముద్ర తీరప్రాంతాన్ని ఆనుకుని, ఆధ్యాత్మికంగా దేశంలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన నియోజకవర్గం పిఠాపురం. ఈ నియోజకవర్గం పల్లపు భూములతో పాటు మెట్ట, సముద్ర ప్రాంతం కలిగి ఉంది. గోదావరి, ఏలేరు కాలువలపై ఆధారపడి పంటలు పండిస్తారు. ఇక్కడ వరి పంటతో పాటు, పత్తి, మిరప, ఉల్లి వంటి అనేక వాణిజ్య పంటలు పండుతాయి. ఎక్కువ వ్యవసాయ ఆధారిత ప్రాంతం. కొత్తపల్లి మండలంలో మత్స్యకారులు చేపల వేటపై ఆధారపడి జీవిస్తారు. ఇక్కడ చేపల వ్యాపారం రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. ఇక్కడి చేనేత కార్మికుల చేతిలో రూపుదిద్దుకునే జాంధానీ చీరలకు అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. వ్యవసాయ రంగంలోనూ ప్రత్యేక గుర్తింపు కలిగి ఉంది. ప్రపంచంలో ఎక్కడా పండని పొట్టి మిర్చి ఇక్కడ పండిస్తారు. అన్ని రకాల కూరగాయలు పండించడంలో ఇక్కడి రైతులకు గుర్తింపు ఉంది. మత్స్య సంపద ఉత్పత్తిలో రాష్ట్రంలో పిఠాపురం నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉంది. రొయ్యపిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. ఉప్పాడలో మేజర్ హార్బర్ నిర్మాణం చివరి దశలో ఉంది.

నియోజకవర్గ స్వరూపం

పిఠాపురం నియోజకవర్గంలో కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాలతో పాటు పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ ఉన్నాయి. మొత్తం 51 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.



పాదగయ క్షేత్రం

ఇప్పటి వరకూ గెలిచిన ఎమ్మెల్యేలు

1. రావు వెంకట జగ్గారావు (1952 – సీపీఐ)
2. వాడ్రేవు గోపాలకృష్ణ (1955 – ప్రజాపార్టీ)
3. పేకేటి తమ్మిరాజు (1960 – ప్రజాపార్టీ)
4. రావు భావనరావు (1962 – కాంగ్రెస్)
5. యాళ్ల నారాయణమూర్తి (1967, 1972 – కాంగ్రెస్)
6. కొప్పన మోహనరావు (1978–89 – కాంగ్రెస్)
7. వెన్నా నాగేశ్వరరావు (1983, 85, 94 – టీడీపీ)
8. సంగిశెట్టి వీరభద్రరావు (1999 – ఇండిపెండెంట్)
9. పెండెం దొరబాబు (2004 – బీజేపీ)
10. వంగా గీత (2009 – ప్రజారాజ్యం)
11. ఎస్‌వీఎస్ఎన్ వర్మ (2014 – ఇండిపెండెంట్)
12. పెండెం దొరబాబు (2019 – వైఎస్సార్ సీపీ)



ఉప్పాడ సాగర తీరం

2019-23 మధ్య వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి

పథకం	లబ్దిదారులు	నిధులు (రూ.కోట్లలో)
వైఎస్సార్ పెన్షన్ కానుక	1,66,400	642.62
జగనన్న అమ్మ ఒడి	12,378	159.96
వైఎస్సార్ చేయూత	13,219	70.31
వైఎస్సార్ ఆసరా	2,340	124.53
వైఎస్సార్ రైతు భరోసా	12,413	8.84
ఇళ్ల స్థలాలు	16,906	
వైఎస్సార్ సున్నా వడ్డీ	1,67,293	23.25
వైఎస్సార్ కాపు నేస్తం	4,557	49.72
వైఎస్సార్ నేతన్న నేస్తం	719	15.67
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	992	4.77
వైఎస్సార్ బీమా	253	8.92
వైఎస్సార్ వాహనమిత్ర	1,012	9.40
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	5,175	14.26
సున్నా వడ్డీ పంట రుణాలు	1,917	1.86
జగనన్న విద్యా దీవెన	4,003	57.68
జగనన్న వసతి దీవెన	3,946	27.06
డీజిల్ సబ్సిడీ		6.00
జగనన్న చేదోడు	678	3.03
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	3,028	70.84
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	630	1.17
వైఎస్సార్ మత్స్యకార భరోసా	6,729	29.16
జగనన్న తోడు	7,411	16.65
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	7,587	55.08
జగనన్న గోరుముద్ద	11,553	16.99
జగనన్న విద్యా కానుక	9,884	15.27
జగనన్న పాల వెల్లువ	436	3.98
వైఎస్సార్ యంత్ర సేవా పథకం	136	6.50
ఉచిత పంటల బీమా	4,273	34.62
పశునేస్త పరిహార పథకం	69	0.61
కంటి వెలుగు	28,722	85.32
వైఎస్సార్ పీఎంఏవై అర్బన్	353	19.73
వైఎస్సార్ పీఎంఏవై గ్రామీణం	651	37.21
పీఎం స్వనిధి	914	5.56
జగనన్న జీవక్రాంతి	146	0.81

ఇవీ ప్రత్యేకతలు

- అష్టాదశ శక్తి పీఠాల్లో 10వదైన పురుహూతికా అమ్మవారు వెలసిన క్షేత్రం పిఠాపురం.
- దేశంలోని మూడు గయా క్షేత్రాల్లో ఒకటైన పాదగయ ఇక్కడే ఉంది.
- దత్తాత్రేయుని అవతారంగా భక్తులు భావించే శ్రీపాద శ్రీవల్లభ స్వామి జన్మస్థలం ఇది. ఇక్కడకు దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు వస్తూంటారు.
- దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన కుంతీమాధవస్వామి ఆలయం ఉన్న దివ్యక్షేత్రం పిఠాపురం.
- ఉప్పాడ సాగరతీరం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది.
- తీర ప్రాంతంలో నిర్మించిన రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాలు పెద్ద మొత్తంలో విదేశీ మారకద్రవ్యాన్ని తెచ్చిపెడుతున్నాయి.
- నియోజకవర్గంలోని తీరప్రాంతంలో ఏటా రూ.150 కోట్ల మేర మత్స్యసంపద క్రయవిక్రయాలు జరుగుతుంటాయి.
- ఈ నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. రవాణా మార్గాల అభివృద్ధితో వ్యాపార లావాదేవీలు భారీగా పెరిగాయి.

ప్రశాంతంగా ఏపీ ఈసెట్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ అనంతపురం వర్సిటీ ఆధ్వర్యంలో ఈసెట్–24 ఆన్‌లైన్ పరీక్షను బుధవారం కాకినాడ జిల్లాలోని ఐదు కేంద్రాలలో బుధవారం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహించిన పరీక్షకు 2,140 మంది దరఖాస్తు చేసుకోగా 2,094 మంది హాజరయ్యారు. కాకినాడ అచ్యుతాపురం అయాన్ అన్‌లైన్ కేంద్రంతో పాటు సూరంపాలెం ప్రగతి, ఆదిత్య కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని కన్వీనర్ భానుమూర్తి తెలిపారు.

అర్ధరాత్రి పచ్చమూకల బరి తెగింపు

- హోంమంత్రి బస చేసిన ఇంటిపై టీడీపీ వర్గీయుల దాడి
- 14 బైక్‌ల ధ్వంసం, ఆరుగురికి గాయాలు
- సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారాలతో పోలీసులకు మంత్రి వనిత ఫిర్యాదు


విలేకర్లతో మాట్లాడుతున్న హోంమంత్రి వనిత


దాడిలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

నల్లజర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ పార్టీ అభ్యర్థులకు లభిస్తున్న ప్రజాదరణను చూసి పచ్చమూకలు తట్టుకోలేక పోతున్నాయి. ప్రజాస్వామ్య విలువలను మంట గలుపుతూ బరితెగించి దాడులకు పాల్పడుతున్నాయి. ఇందులో భాగంగానే ఎన్నికల ప్రచారం అనంతరం నల్లజర్లలో హోంమంత్రి తానేటి వనిత బస చేసిన వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం ఇంటిపై మంగళవారం అర్ధరాత్రి టీడీపీ నాయకుడు, మాజీ జెడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, గోపాలపురం టీడీపీ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజుతో సహ దాదాపు 30 నుంచి 40 మంది దాడి చేశారు. ఇనుపరాడ్లు, సర్వేకర్రలతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడి చేసి బీభత్సం సృష్టించారు. హోంమంత్రి ఉన్న గది తలుపులను పగులగొట్టడానికి విఫలయత్నం చేశారు. మరో రెండు గదుల తలుపులు పగులగొట్టారు. 14 బైక్‌లతో పాటు కుర్చీలు, ఫర్నిచర్, డీజే వాహనాన్ని ధ్వంసం చేశారు. ఆ సమయంలో స్థానిక పోలీసు అధికారులు అక్కడే ఉన్నా టీడీపీ వర్గీయులను నిలవరించలేకపోయారు. టీడీపీ వర్గీయుల దాడిలో వల్లూరి శేషగిరిరావు, ముత్తిన నరేష్, ఏపూరి క్రాంతి, రాయుడు గంగాధరరావు, ఆలపాటి రాంభాస్కరావు, పాతూరి సత్యనారాయణ గాయపడ్డారు. దీనిపై తనపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సీసీ ఫుటేజ్‌ల ఆధారాలతో మంత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ నాయకులకు ఓటమి భయం: మంత్రి వనిత

హోంమంత్రి తానేటి వనిత విలేకరులతో మాట్లాడుతూ ఒక దళిత మహిళ హోంమంత్రిగా ఉండటం, రాబోయే ఓటమిని జీర్ణించుకోలేక పోవడం, నల్లజర్లలో పెద్దెత్తున ర్యాలీ, ఎన్నికల ప్రచారం జరగడం తట్టుకోలేక తనపైనా, తమ కార్యకర్తలపైనా, నాయకులపైనా టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారన్నా రు. వీళ్లచేసే అరాచకాలను చూస్తుంటే మనం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నమో లేదో అర్థం కావడం లేదన్నారు. నిర్దిష్ట సమయానికి ప్రచారం ఆపి, మా నాయకుడి ఇంట్లో బస చేస్తే, దౌర్జన్యం చేయటం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. సెక్యూరిటీ రక్షణగా ఉండటంతో తాను ప్రాణాలతో బయటపడ్డానన్నారు. ఎన్నికల బరిలో ఉన్న టీడీపీ అభ్యర్థి కూడా దాడికి రావడం చూస్తుంటే వారిలోని ఓటమి భయం బహిర్గతమైందన్నారు. కాగా.. ఈ ఘటనపై నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరూ సమన్వయం పాటించాలని సూచించారు.

8 మంది టీడీపీ నాయకులపై కేసు

హోంమంత్రి తానేటి వనితపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి 8 మంది టీడీపీ వర్గీయులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ రామారావు బుధవారం ఉదయం విలేకరులకు తెలిపారు. వారిలో జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, టీడీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు ఉన్నారన్నారు. వీరిపై ఎస్సీ, ఎస్టీ, హత్యాయత్నం కేసులు నమోదయ్యాయన్నారు. నల్లజర్లలో ఎటువంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా ముందస్తుగా 144 సెక్షన్ విధించినట్టు చెప్పారు.

వస్త్ర దుకాణంలో మంటలు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తుని: స్థానిక పెంటకోట రోడ్డులోని పుష్పాంజలి వస్త్ర, రెడీమేడ్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. బుధవారం మధ్యాహ్నం 2.40 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో షాపు యాజమాని రెడ్డి సూరిబాబు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాద సమయంలో షాపులో పనిచేస్తున్న సిబ్బంది భోజనానికి వెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక అధికారి రాముడు మాట్లాడుతూ మూడు గంటల పాటు శ్రమిస్తే మంటలు అదుపులోకి వచ్చాయన్నారు. భారీగా నష్టం జరిగిందని భావిస్తున్నామన్నారు.

పిఠాపురంలో సీఎం జగన్ ఎన్నికల సభ


పిఠాపురంలో స్థలాలను పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం తదితరులు

స్థలాలను పరిశీలించిన ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిఠాపురంలో ఎన్నికల ప్రచారానికి రానున్న నేపథ్యంలో సభ నిర్వహించే స్థలాలను సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం బుధవారం పరిశీలించారు. పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్ తదితర ప్రాంతాల్లో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. జనం భారీగా తరలి వచ్చే అవకాశం ఉండడంతో అనువైన ప్రాంతాలను గుర్తిస్తున్నారు. వాటినన్నింటినీ పరిశీలించి ఎక్కడ నిర్వహించేది నిర్ణయించనున్నారు. రఘురాం వెంట రాష్ట్ర భూదానం బోర్డు చైర్మన్ తాడి విజయ భాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, వైఎస్సార్ సీపీ నాయకుడు గండేపల్లి బాబీ ఉన్నారు.

ఆదిత్య విద్యార్థుల సేవా కార్యక్రమం


నీటి తొట్టెలు ఏర్పాటు చేసిన ఆదిత్య ఎన్‌యస్‌యస్ విద్యార్థులు

బాలాజీచెరువు: ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బుధవారం సేవా కార్యక్రమం చేపట్టారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో పశుపక్షాదుల దాహార్తిని తీర్చేందుకు నీటి వసతి కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కరుణ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఇలాంటి ఆలోచన రావడం సంతోషమన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తమ పూర్తి సహకారం ఉంటుందన్నారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, పీవో వంశీ, సురేఖ, పీడీ సత్యవతి తదితరులు విద్యార్థులను అభినందించారు.

వైభవంగా తలుపులమ్మ జాతర


ఆకట్టుకున్న కేరళ బృందం ప్రదర్శన

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి సంబరాలు వైభవోపేతంగా జరిగాయి. 13 రోజులు జరిగిన ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా లోవదేవస్థానం కార్య నిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు ఆధ్వర్యంలో లోవకొత్తూరు గ్రామంలో వివిధ సాంఘిక, జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు, తీర్థం, అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. వి.కొత్తూరు, కుమ్మరిలోవ, రాజుపేట, మర్లపాడు, సీత్యపేట, కొత్త వెలంపేట, వెలంపేట కాలనీ, జగన్నాథగిరి గ్రామాల్లో ఉత్సాహంగా జాతరలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామాల్లో విద్యుత్ దీపాలంకరణలు, బాణసంచా పేలుళ్లతో ఉత్సవాలను భారీగా నిర్వహించారు.

ఐటీఐలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024–25 సంవత్సరానికి మొదట విడత అడ్మిషన్లకు పదో తరగతి, ఆపై అర్హత కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ తెలిపారు. ఆసక్తి కలవారు ఐటిఐ.ఏపీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్‌లో గురువారం నుంచి జూన్ 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకుని రశీదు పొందాలన్నారు. వారందరికీ ఈ నెల 10 నుంచి జూన్ 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 92940 50231 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జగన్ పాలనలోనే ముస్లింలకు రక్షణ

రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌ఆజం

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ముస్లింలకు రక్షణ సాధ్యమని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌ఆజం అన్నారు. స్థానిక జాంపేటలోని హబీబుల్లాఖాన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థులు మార్గాని భరత్ రామ్ (రాజమహేంద్రవరం సిటీ), చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ (రూరల్), జక్కంపూడి రాజా (రాజానగరం) తరఫున ఎన్నికల ప్రచారం చేసేందుకు రెండు రోజులుగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. ముస్లిం, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీలందరూ ఒక తాటిపైకి వచ్చి జగన్‌కు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీలకు చెందిన 50 లక్షల మందికి పైగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ ఫలాలు అందుకున్నారన్నారు. సుమారు 850 మంది పైగా పదవులు పొందారని అన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేనల పొత్తు అక్రమమన్నారు. బీజేపీకి ఓటువేస్తే దేశం నుంచి ముస్లింలను తరిమివేస్తుందని హెచ్చరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలో ఉండగా ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేశారని, అప్పుడే అనేక వేల మంది ఉద్యోగాలు పొంది మంచి స్థితిలో ఉన్నారని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు 14 ఏళ్లు పాలించినా ముస్లింలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు హబీబుల్లాఖాన్ మాట్లాడుతూ కూటమి పార్టీలు తోడు దొంగలని అన్నారు. సమావేశంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఆరిఫ్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నిజాం, సిటీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఆరిఫుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

10 వరకూ తత్కాల్‌లో ఇంటర్ ఫీజుకు అవకాశం

అమలాపురం టౌన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వాటికి ఇంకా ఫీజు చెల్లించని విద్యార్థులకు తత్కాల్ స్కీమ్‌లో అవకాశం ఉందని డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. తత్కాల్ స్కీమ్ కింద విద్యార్థులు రూ.మూడు వేలు జరిమానాగా చెల్లించాలని, ఈ విద్యార్థులు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో మాత్రమే పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల పదో తేదీ సాయంత్రం మూడు గంటల లోపు ఫీజు చెల్లించాలని సూచించారు.

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజును తత్కాల్ స్కీమ్ ద్వారా ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల లోపు ఆన్‌లైన్ విధానంలో చెల్లించవచ్చునని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు పర్యవేక్షణాధికారి ఎల్.నరసింహం తెలిపారు.